"... సరసమంటే ఏమిటి?"


బిత్తరపోయాను. ఏ భర్తా తన భార్యతో జరిపే మొట్టమొదటి సంభాషణలో, తొలి ప్రశ్నగా దాన్ని ఎన్నుకోడు. స్వచ్ఛమైన ఉర్దూలో అతడు అడిగిన ప్రశ్నకి ఏ సమాధానం చెప్పాలో తెలియక మౌనం వహించాను.

నా అయోమయాన్ని అతడు అర్థం చేసుకున్నట్టు సన్నగా నవ్వి, "... నువ్వు రావటం ఆలస్యం అయ్యేసరికి ఒక కవిత వ్రాద్దామని కూర్చున్నాను. 'సరసము' అన్న పదానికి సరి అయిన అర్థం తెలియలేదు. రాగానే ఇలా అడిగినందుకు కంగారుపడ్డావా?" అన్నాడు.

నేను కూడా తేరుకుని, "అదేం లేదు!" అని ఉత్సుకతతో "మీరు కవితలు వ్రాస్తారా?" అని అడిగాను.

ఈసారి ఆశ్చర్యపోవటం అతని వంతయింది-"నీకు తెలీదా నూర్జహాన్? మీ వాళ్లు చెప్పలేదా?" అన్నాడు-"నీ కవిత చదివే నీ కోసం భారతదేశంలో వాకబు చేశాను."

# నీలో నాలో...



యండమూరి వీరేంద్రనాథ్

సనాతన ముస్లిమ్‌ల కుటుంబం మాది. గోదావరికి పశ్చిమాన కొవ్వూరికి వంద కిలోమీటర్ల దూరంలో ఒక పల్లెటూరు. మా కుటుంబాల్లో స్త్రీ అభిప్రాయాలకి అంత విలువ ఇవ్వరు. అందులోనూ ఒక ఉన్నతపదవిలో ఉన్న సైనికాధికారి ఏరికోరి వచ్చి చేసుకుంటానంటే ఇక కావల్సింది ఏముంది? నన్ను అడగకుండానే మా తల్లితండ్రులు ఎగిరి గంతేసి ఒప్పుకున్నారు. ఆ విధంగా ఆసిఫ్ అహ్మద్‌కి నేను అర్ధాంగినయ్యాను.

మా ముస్లిమ్స్‌లో జుల్వా అవగానే, పెళ్లికూతురు భర్త ఇంటికి వచ్చేస్తుంది. సుహాగ్ రాత్ (శోభనం) పెళ్లికొడుకు ఇంట్లో జరుగుతుంది.

హిందువుల్లో అలా కాదు. ఆ విధంగా నేను పెళ్లవగానే పశ్చిమ గోదావరి జిల్లా నుంచి పాకిస్తాన్ వచ్చేశాను.

అన్నట్టు చెప్పటం మర్చిపోయాను మా ఆయన పనిచేస్తున్నది పాకిస్తాన్ సైన్యంలో ...!

000 000 000

పెహలీరాత్, గదిలోకి పంపబోయేముందు చేసే తతంగాన్ని 'కరీమా' అంటారు. అంతటి ఆజానుబాహువూ మామూలుగా గంభీరంగా ఉండేవాడూ అయిన నా భర్త-చిన్నపిల్లాడిలా పూలబంతుల్తో ఆడటం చూసి నవ్వుకున్నాను. తొలిరాత్రి మల్లెపూలు ఎక్కువగా వాడతారని పుస్తకాల్లో చదివాను. కానీ, మాలో గులాబీ రేకుల్నీ, అత్తరునీ ఎక్కువ ఉపయోగిస్తారు. ఆ పరిమళం మల్లెలాగా మత్తెక్కించదు. ఆహ్లాదకరంగా ఉంటుంది. కామానికీ, శృంగారానికీ ఉన్న తేడాలా అనిపిస్తుంది.

ఆ పక్కమీద పరచుకుని ఉన్న గులాబీరేకుల్నీ పక్కకి తొలగిస్తూ ఒక పుస్తకంలో కవిత తీసి నాకు చూపించి, "ఇది నువ్వు వ్రాసిందేగా?" అన్నాడు. నేను వ్రాసిందే అది. 'జిహేద్' అన్న ఉర్దూ పత్రికలో పడింది. అది అహ్మదాబాద్ నుంచి వెలువడుతుంది. జిహేద్ అంటే పోరాటం అని అర్థం. పేరుకు పోరాటమే కానీ, అన్ని రకాల కథలూ, కవితలూ వేస్తారు. నేను వ్రాసిన కవితని వాళ్లు వేసుకోవటం, పైగా పది రూపాయలు పారితోషికం పంపటం నాకు అపూర్వమైన అనుభవం!

"ఇండియా నుంచి వస్తూ నా స్నేహితుడు లాహోర్‌లో ఈ మ్యాగజైన్ తెచ్చాడు. నీ ఫొటో చూసి మనసు పారేసుకున్నాను. కవిత చదివి మెదడు పోగొట్టుకున్నాను."


"నా కవితని పొగుడుతున్నారా, తిడుతున్నారా?" చిరుకోపంతో ప్రశ్నించాను.

అతడు తెల్లబోయి "... అంత బావోకపోతే పరాయి దేశంలో ఉన్న పిల్లని వెతికి వెతికి ఎందుకు పట్టుకుంటాను?" అన్నాడు.

నిజమే కదా అనిపించింది.

ఈలోపులో అతను అన్నాడు-"నాకూ ఈ కవితల పిచ్చి ఉంది. ఇద్దరి అభిరుచులూ కలుస్తాయనిపించింది. నీ పేరు చూశాను. నూర్జహాన్ అని కనిపించింది. నా మిత్రునితో ఎంక్వయిరీ చేయించాను."

తరువాత విషయం నాకు తెలిసిందే. మా తల్లితండ్రులు ఉప్పొంగిపోయారు. పాకిస్తాన్ అంటే ఎంత లేదన్నా మా వాళ్లకి ప్రేమే! మా తల్లిగారి తండ్రిగారు కరాచీ నుంచి ఆంధ్రదేశానికి వలసవచ్చారు. మా తల్లీ, పాకిస్తాన్ మాజీ ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టో ఒకే రోజున (1928లో) పుట్టారు. యాభై ఒక్క ఏళ్ల భుట్టోని పాకిస్తాన్ సైన్యం ఉరి తీసినప్పుడు, నా తల్లి దుఃఖించటం నాకు గుర్తుంది.



ఆసిఫ్ అహ్మద్‌తో నా వివాహానికి ఇరు ప్రభుత్వాల తరఫు నుంచీ ఏవైనా అభ్యంతరాలు వస్తాయేమోనని మేము భయపడ్డాము. ఆసిఫ్ సైన్యంలో ఉన్నతస్థానంలో ఉన్నాడు కాబట్టి, ముఖ్యంగా పాకిస్తాన్ నుంచి అభ్యంతరం ఉంటుందేమో అనుకున్నారు. అయితే అలాంటిదేమీ జరగలేదు. వీసా సులభంగానే లభించింది.

"దేవిగారు ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్న ప్రశ్నకి ఊహల్నించి బయటపడి నవ్వాను. "నేను ఏదో కవిత వ్రాయడమేమిటి? దాన్ని ఏదో పత్రికకి పంపటం ఏమిటి? మీరు చదివి, పెళ్లికి రాయబారం పంపటం ఏమిటి? గోదారి ఒడ్డు నుంచి, ఇండస్ తీరానికి నేను రావటం ఏమిటి?" అన్నాను.

తన దేశపు నది గురించి ప్రస్తావించేసరికి అతడు గమ్మత్తుగా కళ్లు ఎగరేసి, "ఓ! నువ్వు హిస్టరీలో గ్రాడ్యుయేట్‌వి కదూ!" అన్నాడు. అతడు నా చేతిని తన చేతిలోకి తీసుకుంటూ ఉండగా ఫోన్ మోగింది. అతడు నుదురు చిట్లిస్తూ దాన్ని అందుకుని అవతలివారు ఏదో చెప్తూంటే "సరే... సరే...!" అని కొంచెంసేపు మాట్లాడి ఫోన్ పెట్టేశాడు.

"ఎక్కణ్నుంచి ఫోన్?" అని అడిగాను.

"జనరల్ తాలూకు ఆఫీసునుంచి!" అన్నాడు. "... మీ ప్రధాని బస్సులో లాహోర్ వస్తున్నారట. సెక్యూరిటీ చీఫ్‌గా నన్ను నియమించారు!" అన్నాడు.

మెరుస్తున్న కళ్లతో-"కంగ్రాట్స్!" అన్నాను. "వాజ్‌పేయి మాకు నచ్చిన ప్రధాని."

అతనిలో అంత ఉత్సాహం కనపడలేదు... "సరే, ఇక దాని గురించి మర్చిపోదాం!" అంటూ ముందుకు వంగి పెదవులపై ముద్దు పెట్టుకున్నాడు.

అంత అకస్మాత్తుగా అతడు అలా ముద్దిడేసరికి కాస్త కంగారుపడ్డాను. అతడిలోంచి నాలోకి ఏదో శక్తి ప్రవహిస్తున్న అనుభూతి కలిగింది. తన అవయవాలన్నిటి తరఫునా తన 'నాలుక'ని రాయబారిగా నియమించి, నా తనువు దుర్గంలోకి పంపినట్టున్నాడు. ఆ రాయబారే గూఢచారి బాధ్యతలు కూడా స్వీకరించినట్టు నాకెందుకో అనుమానం కలిగింది.

కానీ కొద్ది క్షణాల తరువాత, ఆ అనుమానాన్ని మరొకటి అధిగమించింది. నన్ను ఒకవైపు ముద్దిడుతూనే అతడు తన ఆలోచనల్లో ఎక్కడో జారుకున్నట్టు గమనించాను. కాస్త దూరంగా విడివడి, "ఏం ఆలోచిస్తున్నారు?" అన్నాను.

అతను నవ్వి, "మా గురించే!" అన్నాడు. "శత్రువుకి సెక్యూరిటీ ఇవ్వాల్సివస్తోంది, చూశావా?" అన్నాడు.

"శత్రువైనా అతడు మన అతిథి కదా!" అన్నా. 'మన' అనటం నాకు గమ్మత్తుగా అనిపించింది. అతడు మాట్లాడలేదు. మూడ్ మార్చడానికి "ఆ అతిథి గురించే తప్ప, పక్కనున్న అభాగ్యతి గురించి ఆలోచించరా?" అన్నాను-ఉర్దూలో చిన్న షాయిరీలా!

అతడికి అర్థమైంది. ఆవేశంతో చప్పున దగ్గరకి లాక్కున్నాడు.

అది నాకు తొలి పురుషస్పర్శ. బస్ స్టాపుల్లో తగిలేవాళ్ల గురించి కాదు నేను చెప్పేది. తనువూ, మనసూ సంపూర్ణాంగీకారంతో ఆహ్వానిస్తున్న స్థితిలో స్పర్శ అది!

అందరూ ఇటువంటి సందర్భంలో స్త్రీ శరీరాన్ని వీణతోనూ, పురుషుడిని ఆ వీణ తీగె సుతారంగా శ్రుతి చేసేవాడితోనూ పోలుస్తారు. నాకు అలా అనిపించలేదు. దాపరికం లేకుండా చెపుతాను. నాకెందుకో దూదేకులవాడు గుర్తొచ్చాడు. ఎక్కడో తీగెని కదుపుతాడు ఠాంగ్‌మన్న శబ్దంతో దూది -పింజెలుపింజెలుగా గదంతా వ్యాపిస్తుంది. అతడి చెయ్యి నా వెన్నెముక చివరికి చేరుకునేసరికి నాకు తోచిన పోలిక అది!

మెడ వంపు నుంచి మరో వంపులోకి అతడి మోహం జారేసరికి నా కటి-కెరటమైంది. అలలా శరీరం ఎగసిపడింది. నాలో అంత కోరిక నిక్షిప్తమై ఉందని నాకు తెలియదు.

వయసులో అతడు పాతిక సంవత్సరాలు వెనక్కి వెళ్లాడు. ఆకలే తేడా!

పురుషుడి పరిమళం (ఛా! ఇటువంటి టైమ్‌లో అంత సంస్కారవంతమైన పదం వాడటం అనవసరం) పురుషుడికి ఒక ప్రత్యేకమైన వాసన ఉంటుందని నాకు మొదటిసారి తెలిసింది.

ఒక్కొక్క సిగ్గు పొరా నన్ను వీడి, మంచం పక్కన పడుతోంది.

పెళ్లయ్యాక-ప్రతిరాత్రీ కొంచెంసేపు స్త్రీ భూదేవి అవ్వాలేమో అని భయపడేదాన్ని. రొమాన్స్‌లో బరువూ బాధ్యతలు కూడా ఆనందంగానే ఉంటాయని అర్థమైంది. బరువు సంగతి పక్కనపెట్టి భాగస్వామిగా నా రొమాంటిక్ బాధ్యతలు ప్రారంభించబోయే టైమ్‌కి జరిగిందది!

ఏం జరిగిందీ గ్రహించేలోపులో నాకన్నా ముందే అతడు దాన్ని గ్రహించినట్టు వివర్ణమైన మొహాన్ని వంపుల్లో దాచుకున్నాడు. నా శరీరం వంపుల్లో కాదు... దిండు వంపుల్లో...!

***

నా భర్త నపుంసకుడు కాడని నా మనస్సు గాఢంగా చెప్తోంది. అయినా ఇప్పుడు నా సమస్య అది కాదు. తాను కొత్తగా తెలుసుకున్న చేదు నిజాన్ని జీర్ణించుకోడానికి ఆసిఫ్‌కి కొంత సమయం ఇవ్వాలి. అతడు డిప్రెస్ కాకుండా చూడాలి. అదీ నా ప్రస్తుతబాధ్యత. అందుకే నేను సాధారణంగా ఉన్నట్టు కనపడటానికి ప్రయత్నించాను.

"ఇంతవరకూ నాకు ఏ స్త్రీతోనూ అనుభవం లేదు!" చెప్పాడతను. "కానీ నాకు కరెక్టుగా తెల్సు. నాలో ఏ లోపమూ లేదు. ఎందుకో ఆ సమయంలో నిస్సత్తువో, నిరాసక్తతో ఏర్పడుతోంది. డాక్టర్ని కలవాలో, మానసికశాస్త్రనిపుణుడిని కలవాలో అర్థం కావడంలేదు!"

"ఇప్పుడు తొందరేముందీ... కొంతకాలం వేచిచూద్దాం. తరువాత దానంతట అదే సర్దుకుంటుంది!" అన్నాను మనస్ఫూర్తిగా, నిజాయితీగా. ఎందుకో ఈ సమస్య తాత్కాలికమే అని తోచింది. ఒకరకంగా ఇది మా మధ్య బంధం గట్టిపడటానికి సహాయపడుతుంది అనిపించింది. ఈలోపున ఆసిఫ్ తల్లి మమ్మల్ని 'హనీమూన్' (?) బయల్దేరడానికి తొందరపెట్టింది.

***

పాకిస్తాన్‌కి ఉత్తరం వైపున హిమాలయా పర్వతాల అంచులో 'స్కార్డూ' అన్న ప్రాంతం ఉంది. పర్వతశిఖరాల మీద కరిగిన మంచు 'హూషే' నదిగా మారి అక్కణ్నుంచి దక్షిణానికి ప్రవహించి ఇండస్‌లో కలుస్తుంది. దూరంగా తెల్లటి కొండలు, మధ్యలో నది, చుట్టూ తోటలూ, పచ్చిక బయళ్లు... చాలా మనోహరంగా ఉంది ఆ దృశ్యం.

ఆసిఫ్ నా చేతిలో చేయి వేసి దగ్గరకి తీసుకుంటూ "ఈ ప్రపంచంలోనే ఇంత అద్భుతమైన ప్రదేశం ఇంకెక్కడా లేదు!" అన్నాడు.

నేను అతన్ని అల్లరిపట్టిస్తూ "మా గోదావరి పక్కన ఇంతకన్నా వెయ్యిరెట్లు అందంగా ఉంటుంది!" అన్నాను.


ఆసిఫ్ మొహంలో రంగులు మారాయి. "వీల్లేదు, ఉండటానికి వీల్లేదు!" అన్నాడు.

నేను అతడి మొహంలోకి సూటిగా చూస్తూ, "మీరెలా చెప్పగలరు? రెండు ప్రదేశాలూ చూసింది నేను. మీరొక్క ప్రదేశమే చూశారు. కాబట్టి నా వాదమే కరెక్టు!" అన్నాను.

అతడు దెబ్బతిన్నట్టు నావైపు చూసి కొద్దిసేపు ఏమీ మాట్లాడలేదు. అతడి తరఫు నుంచి వాదం ఏమీ లేదని నాకు తెలుసు. కానీ, ఓడిపోవడం ఇష్టం లేనట్టుగా "ప్రతిదీ చూసి అనుభవించి చెప్తేనే నిజమవుతుందా ఏమిటి?" కాస్త స్వరం హెచ్చించి అన్నాడు.

అది మూర్ఖవాదం అని నాకు తెల్సు. కానీ, నేను దాని గురించి ఆలోచించడం లేదు. అతడి మొహంవైపే చూస్తున్నాను. జేగురు రంగుకి మారిపోయింది అతడి మొహం.

ఇలాంటి మొహాన్నే నేను తరచూ మా ఇంట్లో చూస్తూ ఉండేదాన్ని. కాబట్టి నేను వెంటనే



పోలిక పట్టుకోగలిగాను.

ఆ మొహం నా తండ్రిది!

దాదాపు యాభై సంవత్సరాల క్రితం కరాచీ నుంచి కట్టుబట్టలతో వచ్చేసినందుకు అతడికి తన మీదా, సమాజం మీదా కసి పెరిగింది. ప్రతిరోజూ విపరీతంగా తాగడం అలవాటైంది. ఆ విసుగూ, చిరాకూ ఎక్కువైతే అకారణంగా కోపం వచ్చేది. నా తల్లితో వాదం వేసుకునేవాడు. అందులో ఏ బలమూ లేకపోయినా మగవాడు కాబట్టే గెలిచేవాడు. నా తల్లి అతడి చేతుల్లో అప్పుడప్పుడూ తన్నులు కూడా తినేది. అలా కొడుతున్నప్పుడు నా తండ్రి మొహం కూడా ఇలాగే జేగురు రంగుకి మారటం నాకు గుర్తుంది.

నా భర్తతో అకారణమైన వాదాన్ని పొడిగించటం ఇష్టం లేక దూరంగా ఉన్న పర్వతాలని చూపిస్తూ, "అటువైపే కదా భారతదేశం?" అన్నాను.

"అవును. దాన్ని కార్గిల్ అంటారు, అతి తొందరలో అక్కడ యుద్ధం జరగబోతోంది!" అన్నాడు ఆసిఫ్.

అతి కొద్దికాలంలోనే అతడి మాట నిజమైంది. వాజ్‌పేయి వచ్చి వెళ్లిపోయిన కొన్ని నెలలకి యుద్ధం ప్రారంభమైంది. ఎక్కువ కాలం జరగలేదు కానీ ఆసిఫ్‌కి మాత్రం తట్టుకోలేనంత దెబ్బ తగిలింది. అతడి ప్రాణమిత్రుడూ, మరో సైనికాధికారీ అయిన ఇక్బాల్ ఆ పోరాటంలో మరణించాడు. యుద్ధానికి వెళ్లడానికి ముందురోజే ఇక్బాల్ మా ఇంట్లో 'దావత్'కి రావడం గుర్తుంది. అతడి మరణవార్త తెలిసి, నా భర్త ఆసిఫ్ కసితోనూ, ఉక్రోషంతోనూ ఉడికిపోవటం నేను గమనించాను. అతడి కోపమంతా ముషరాఫ్ మీద. అప్పట్లో పాకిస్తాన్ సర్వసైనికాధికారి అతను. అతడు చేసిన దురాక్రమణ పాకిస్తాన్ ప్రధాని అయిన నవాజ్ షరీఫ్‌కి చాలాకాలం వరకూ తెలియదని కొన్ని పత్రికలు వ్రాశాయి. నా భర్తకి ప్రధాని అంటే చాలా గౌరవం. ముషరాఫ్ అంటే కోపం. దీనికి మరొక కారణం కూడా ఉంది. అతడి మిత్రుడు ఇక్బాల్, యుద్ధంలో మరణించినప్పుడు ఆ శవాన్ని 'తమది'గా గుర్తించటానికి పాకిస్తాన్ సైన్యం నిరాకరించింది. దాన్నొక అనాథ కాశ్మీరీ మిలిటెంట్ శవంగా గుర్తించి, భారతసైనికులే పాతిపెట్టారు.

... ... నా భర్త ఆరోగ్యంలో కొద్దికొద్దిగా మార్పు వచ్చినట్టే వచ్చి మళ్లీ యథాస్థితికి వెళ్తోంది. అయితే చాలామంది భార్యాభర్తల కంటే మేము సుఖంగా ఉన్నామని చెప్పుకోవాలి. కారణంమా ఇద్దరి మధ్యా ఉన్న కమ్యూనికేషన్. ఏదన్నా వితండవాదం చేయవలసివచ్చినప్పుడు తప్ప మిగతా పరిస్థితుల్లో ఆసిఫ్‌లాంటి వ్యక్తి భర్తగా లభించడం అదృష్టం. అతడు ప్రవర్తించే విధానం బావుంటుంది. ఇలా కొన్ని రోజులు గడిచాయి.

తన ఆరోగ్యంలో ఏ మార్పూ రాకపోవటంతో ఒక సైకియాట్రిస్ట్‌ని కలుసుకోవాలని నిశ్చయానికి ఆసిఫ్ వచ్చాడు. అతడింతకాలం వేచి ఉండటానికి కారణం ఒకరకంగా నేనే. నాకెందుకో ఇంకా నమ్మకం సడలిపోలేదు. అతడి భార్యగా అతడిలో పురుషపరమైన మార్పుని ఆ సమయంలో నేను గుర్తించగలుగుతున్నాను. కానీ, ఎక్కడో ఏదో మెలిక ఉంది. అదే తెలియడం లేదు. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూండగా-

ఒకరోజు పన్నెండు గంటలకి మా ఇంట్లో ఫోన్ మోగింది. ఆసిఫ్ హడావుడిగా వెళ్లిపోయాడు. నాలుగు రోజులపాటు ఇంటికి రాలేదు. అప్పుడే విస్ఫోటనం లాంటి వార్త తెలిసింది. పాకిస్తాన్ ప్రధాన్ నవాజ్ షరీఫ్‌ని సైన్యం బంధించింది!!!. అతడి ఇంటిముందు కాపలా కాయడానికి బాధ్యత వహించవలసిందిగా సర్వసైనికాధికారి నా భర్తని కోరాడు. నాలుగు రోజులపాటు ఆ పని నిర్వర్తించి ఇంటికి వచ్చిన ఆసిఫ్ చాలా చిరాగ్గా ఉండటం గమనించాను.

"ఏమైంది?" అడిగాను.

"ప్రధాని నవాజ్ షరీఫ్‌ని మా సైనిక అధికారి ముషరాఫ్ బంధించి జైల్లో పెట్టాడు!" అన్నాడు నా భర్త విసుగ్గా.

"అవును. ఆ విషయం పేపర్లో చదివాను. మీరు ఎవరి కింద పనిచేస్తున్నారు? నవాజ్ షరీఫ్ కిందా, సైనికాధికారి కిందా?" అడిగాను తాపీగా.

నా భర్త తెల్లబోయి నాకేసి చూశాడు.

"అవును. ఒక సైనికాధికారి మిమ్మల్ని యుద్ధానికి పంపించాడు, మరొకవైపు ప్రధాని మిమ్మల్ని యుద్ధం నుంచి వెనక్కి పిలిపించారు. ఈలోపులో మీరు మీ మిత్రుణ్ని కోల్పోయారు. శవాన్ని గుర్తుపట్టనందుకు ముషరాఫ్‌ని తిట్టారు. మళ్లీ ఇప్పుడు ప్రధానిని గృహబంధం చేయమని. అదే సైనికాధికారి ఆజ్ఞాపించారు. ఆ వృత్తి నిర్వర్తించారు. మీకు పని చెప్పేదెవరు? ఎవరి కోసం మీరు పని చేస్తున్నారు? మీ పై అధికారి ఎవరు?" ఆవేశంగా ప్రశ్నించాను.'


ఆసిఫ్ మొహం క్రమక్రమంగా జేగురు రంగుకి మారసాగింది. అతడిలో వస్తున్న పరిణామాన్ని గుర్తించినా నేను బెదరలేదు. నేను చెప్పదల్చుకున్నది అతడికి చెప్పడమే నా ఆశయమని నిశ్చయించుకున్నాను. "ఏదైనా ఒక ప్రాంతాన్నీ, వర్గాన్నీ-ఒక బలవంతమైన దేశం అణగదొక్కితే పక్కదేశమో, మరో సానుభూతి దేశమో ఆ వర్గానికి సాయపడటం న్యాయం. కానీ, కాశ్మీర్లో ప్రజలేమీ కష్టనష్టాలతో తల్లడిల్లిపోవడం లేదే! భారతదేశప్రజల్లాగే వారు కూడా సంపూర్ణస్వాతంత్ర్యంతో బతుకుతున్నారు. వారిని రక్షించవలసిన ఖర్మ మనకేం లేదు!"

"కానీ, కాశ్మీర్ ఒక ముస్లిం దేశం!" అరిచాడు.

నేను కూడా అంతే ఆవేశంగా "పాకిస్తాన్‌లో ఉన్న మొత్తం ముస్లిముల సంఖ్యకన్నా భారత దేశంలో ఉన్న ముస్లిముల సంఖ్య ఎక్కువ!" అన్నాను.

అతడు తన స్వరం మరింత గట్టిగా పెంచి, "జిహేద్ అంటే ఏమిటో తెలుసా నీకూ? పోరాటం!" అన్నాడు.

నేను కూడా అంత గట్టిగానే "దాని గురించి నాకు తెలుసు. అల్లా ఎప్పుడూ ఆ పోరాటాన్ని





మీరు చెపుతున్న పోరాటానికి అన్వయించలేదు. ఆ విషయం మీకు తెల్సు. మీలో ఉన్న ఒక గొప్ప సుగుణం ఏమిటో తెలుసా? మీకు వాదించడం చేతకానప్పుడల్లా అధికారాన్ని చూపిస్తారు. దాన్ని మానుకోండి!" అన్నాను.

అతడు నిరుత్తరుడయ్యాడు. అయోమయంగా నావైపు చూశాడు. ఏమీ మాట్లాడలేనట్టుగా మౌనంగా ఉండిపోయాడు.

నేను కొనసాగించాను-"నేను గోదావరి ఒడ్డునీ చూశాను, ఇండస్ నదినీ చూశాను కాబట్టి, మీకన్నా నేను ఎక్కువ నమ్మకంగా పోల్చి చెప్పగలను. మన ఈ దేశంలో డెబ్భై అయిదు శాతం పైగా జనం కూలీలుగా బతుకుతున్నారు. తినడానికి సరిగ్గా తిండి లేదు. అప్పుల ఊబిలో మనం కూరుకుపోతున్నాం. దానినుంచి మనని బయటవడేయడానికి మన సైన్యం, మన ప్రభుత్వం యుద్ధాన్ని ఎరగా చూపుతోంది. మతాన్ని ఎరగా చూపుతోంది. పన్నెండు లక్షల భారతసైన్యంతో ఆరులక్షలు కూడా లేని పాకిస్తానీ సైన్యం పోరాడి గెలవలేదని మీకు కూడా తెలుసు. అందుకే మీకు అసంతృప్తి. ఒక్కసారి మీరూ ఆలోచించండి!"

అతడు నాకు దగ్గరగా వచ్చి, నా కళ్లల్లోకి చూస్తూ, "నువ్వు చెప్పింది నిజమే అనిపిస్తోంది!" అన్నాడు.

"ఇంత వ్యర్థమైన అనవసరమైన చర్యలకు మన శక్తిని ధారపోయటంకన్నా ఉత్పత్తిరంగం వైపు మన దృష్టి సారిస్తే ఇంతకన్నా బాగా బతుకుతామని నే ననుకుంటున్నాను!" చివరిమాటగా అన్నాను.

***

ఆ రాత్రి అతడు నన్ను దగ్గరకి తీసుకున్నాడు. అతడిలో కొత్త ఆసిఫ్ నాకు కనిపించాడు. హృదయంలోనుంచి ఉబికి వచ్చే సంతృప్తికి చర్మంమీద నిలబడే చెమట బిందువులే తార్కాణమైతే నా శరీరం అతడి తాకిడికి చెమట ముద్దగా మారింది. ఆనకట్ట తెగిన నది క్షణాల్లో ఎలా ఉధృతమవుతుందో ఆ విధంగా కోరిక కట్టలు తెంచుకుని ప్రవహించింది. నా భర్త సంపూర్ణమానవుడయ్యాడు.

పది నిమిషాల తర్వాత ఇద్దరం వెల్లకిలా పడుకుని ఉన్నాం. తలకింద చేతులు పెట్టుకుని అతడు సంతృప్తిగా కళ్లు మూసుకుని ఉన్నాడు.

పై కప్పుకేసి చూస్తూ నేనన్నాను -"మొట్టమొదటి రోజు మీరు నన్నో ప్రశ్న అడిగారు గుర్తుందా? 'సరసము అంటే ఏమిటి?' అని. ఆ తరువాత నేను నిఘంటువు వెతికాను. 'రసము' అంటే అనురాగము. సరసము అంటే సామీప్యము. అయితే ఇది కేవలం శృంగారానికి సంబంధించింది కాదు. మనిషికి సంబంధించింది. తనపట్ల తనకి అనురాగం లేనివాడు, తన భావాలపట్ల తనకి నమ్మకంలేనివాడు, తను ఎవరికోసమైతే పని చేస్తున్నాడో ఆ మనిషిమీద గౌరవమూ, అభిమానమూ లేనివాడు సరసానికి పనికిరాడు! ముషరాఫ్ కింద పనిచేయడం మీలో అసహనాన్నీ, అసంతృప్తినీ నింపింది. మీరు చేసిన పనులపట్ల మీకు గౌరవమూ లేదు, నమ్మకమూ లేదు. 'నా కీరోజు మూడ్ లేదు' అని ఒక్కోసారి మనం అనుకుంటూ ఉంటాం. ఏదో సంఘటన జరగటం వలన మనకా రోజు మూడ్ పోతుంది. అది తాత్కాలికఅసంతృప్తి! అదే జీవితవిధానం వల్ల అసంతృప్తి అనుకోండి. అప్పుడేమవుతుంది? శాశ్వతంగా మూడ్ పోతుంది. మానసికనపుంసకత్వం వస్తుంది. కాశ్మీర్‌లో మీ పోరాటానికి సరి అయిన కారణం లేదు. అదే అకారణఅసంతృప్తి. అందుకే మన తొలిరాత్రి భారత ప్రధానికి సెక్యూరిటీ ఇవ్వవలసి వస్తుందని తెలియగానే మీరు శృంగారంలో నిర్వీర్యులయ్యారు. తనలోకి తను ప్రవహించలేనివాడు, తనని తాను రమించుకోలేనివాడు ఇతరులనెలా రమిస్తాడు? ఇతరుల్లోకి ఎలా ప్రవహిస్తాడు? సరసం అంటే కేవలం ఇతరులలోకి ప్రవహించడం మాత్రమే కాదు. తనలోకి తాను ప్రవహిస్తూ ఆ సంతృప్తిని అవతలివారికి అర్థమయ్యేలా చెప్పడం!"

వెల్లకిలా పడుకుని ఉన్నవాడల్లా నెమ్మదిగా నావైపు తిరిగి సజలనేత్రాలతో కొంచెంసేపు నా మొహంవైపు చూసి, వంగి నా అధరాలపై చుంబించాడు.

ఇక జీవితంలో మరెప్పుడూ అతడి మొహం జేగురు రంగులోకి మారదని నాకెందుకో అపారమైన నమ్మకం కలిగింది. ■



## నీకో విన్నపం విక్రమా!

మ. అరుదెంచెన్ గద 'జన్మభూమి' కృషిచేయున్;
నేడు మా కండ్లకున్
అరయన్ మేలనిపించె నాయకులు;
సౌఖ్యంబయ్యె పేదోండ్లకున్;
మురిపాలూర్చె ప్రభుత్వదీపపథకమ్ముస్గూడ;
పూబోండ్లకున్
అరెరే! పండుగ పబ్బమంచు ఒకటే
ఆర్భాటముల్ తిండ్లకున్!
ఆ.వె. నడిబజారులోన నినాదమ్ములే లేక,
కార్యరూపమునను కదులుచుండె;
కెక్కురుమనక-ప్రతిపక్షరు'-ప్రగతి'పూ
దోట-క్రొత్తచివురు తొడిగినట్లు.
తే.గీ. క్రొత్త-శకమును నిర్మించుకొనగదలచి
నలుగురొకటిగ పూనుకొన్నాము మేము;
ముఖ్యఅతిథిగ నీ రాక ముదము గూర్చు;
సర్వసిద్ధులకును మంచి శకునమనగ!
కం. సురలోకమ్మున అమృతము
దొరకన్-సురలకును దిగులు తొలగిన గతి
-'ఇన్
ఫరుమేషన్ టెక్నాలజి'
'పరమౌ' ప్రజ'-ప్రగతిబాట' పై
పయనించన్!
కం. మణిహారమ్ముల కంటెన్
ఘనమె అయ్యె-కడువేడ్క కాగన్-రాష్ట్ర
మ్మున 'మానవహారమ్ములు'
'జనవాణి'కే నెలనెలా నిజముగ 'వుగాదుల్!'
ఉ. అంగనలందరిన్ నరకయాతనకున్
గురిజేయు 'ఈవ్ టీ
జింగులు' హెచ్చె, పట్టె శని-జడ్డుగ; మా
మదిలోన్ అదొక్కటే
'బెంగ'అరిష్టముల్ తొలగబేగిప్ప్రగాక్షులు
సంతసించ-నీ
రంగము వేసి-నీ బలపరాక్రమ మింకను
చూపు విక్రమా!

వెలిపల సాంబశివరావు